

	ఇఫ్తార్ (శని)	సహర్ (ఆది)
గుంటూరు	6.22	5.04
నరసరావుపేట	6.24	5.06
బాపట్ల	6.22	5.04

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

మహిళల భాగస్వామ్యం తప్పనిసరి



తెనాలిరూరల్: అన్ని రంగాల్లో మహిళల భాగస్వామ్యం తప్పనిసరిగా ఉండాలని సబ్‌కలెక్టర్ సంజనా సింహా అన్నారు. తెనాలి మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు ఎంపీడీవో అత్తోట దీప్తి అధ్యక్షత వహించారు. సబ్ కలెక్టర్ సంజనా సింహా ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ మహిళల ప్రాధాన్యాన్ని వివరించారు. మహిళా దినోత్సవ సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. వెలుగు ఏపీఎం జయశ్రీ వందన సమర్పణ చేశారు. ఎంపీడీవో కార్యాలయ పరిపాలన అధికారి శ్రీనివాసరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు. కార్యక్రమంలో తెనాలి డీఎల్‌డీఓ శ్రీదేవి, పంచాయతీరాజ్ ఏఈ పార్వతి, ఆర్‌డబ్ల్యూస్ ఏఈ అనూష, సీడీపీఓ సునీత పాల్గొన్నారు. స్వయం సహాయక సంఘాలు తయారు చేసిన ఉత్పత్తుల ప్రదర్శనను సబ్ కలెక్టర్ సందర్శించారు.

కాంట్రాక్టు స్టాఫ్‌నర్సు ప్రావిజనల్ మెరిట్ లిస్టు విడుదల

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు (ఆర్డీ) కార్యాలయం పరిధిలో కాంట్రాక్టు స్టాఫ్‌నర్సు ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న వారి ప్రావిజనల్ మెరిట్ లిస్టును విడుదల చేసినట్లు ఆర్డీ డాక్టర్ కె.సుచిత్ర తెలిపారు. జాబితాలో ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 13వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు గుంటూరు ఆర్టీసీ బస్టాండ్ వెనుక ఉన్న ఆర్డీ కార్యాలయంలో తెలియజేయాలని పేర్కొన్నారు. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో 44 కాంట్రాక్టు స్టాఫ్ నర్సు ఉద్యోగాలకు గత ఏడాది డిసెంబరు 30న నోటిఫికేషన్ విడుదల చేశామన్నారు. నోటిఫికేషన్‌లో 44 కాంట్రాక్టు స్టాఫ్‌నర్సు ఉద్యోగాలు ఉన్నాయని, 5,888 మంది ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్నట్లు వెల్లడించారు.

స్వచ్ఛాంధ్ర పోస్టర్ల ఆవిష్కరణ



గుంటూరు రూరల్: స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించడంలో భాగంగా ముద్రించిన పోస్టర్లను కలెక్టర్ నాగలక్ష్మి శుక్రవారం ఆవిష్కరించారు. కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ, నగర కమిషనర్ శ్రీనివాసులు, తెనాలి సబ్ కలెక్టర్ సంజనాసింహా, డీఆర్‌ఓ షేక్ ఖాజావలి, డీపీఓ సాయికుమార్, రూరల్ మండలం ఎంపీడీవో బండి శ్రీనివాసరావు, విస్తరణ అధికారి కె శ్రీనివాసరావు పాల్గొన్నారు.


ప్రపంచ శాంతి కోసమే గుడారాల పండుగ



అమరావతి: ప్రభువైన ఏసుక్రీస్తుచే తేజరింపచేసి ప్రపంచంలోని మానవులందరి ఉజ్జీవం కోసం గుడారాల పండుగలో ప్రార్థనలు చేస్తున్నామని హోసన్నా మినిస్ట్రీస్ అధ్యక్షుడు, దైవజనులు ఫాస్టర్ అబ్రహం అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని హోసన్నా దయాక్షేత్రంలో హోసన్నా మినిస్ట్రీస్ నిర్వహించే 48వ గుడారాల పండుగ రెండవ రోజు రాత్రిపూట ప్రార్థనలకు వచ్చిన లక్షలాది మంది ఆరాధికులను ఉద్దేశించి ఆయన ప్రసంగిస్తూ ఈ పండుగలో విశ్వాసులు, సేవకులు ఉజ్జీవింపబడాలంటే దేవుని చేత ప్రకాశించి, వాక్యం మీద ఆసక్తి కలిగి దేవుని ప్రార్థనే ఊపిరిగా భావించాలన్నారు. అనంతరం రెండవ వర్తమానంలో హోసన్నా మినిస్ట్రీస్ చీఫ్ పాస్టర్ జాన్‌వెస్లీ ప్రసంగించారు.

అవనితలాన అద్భుతం

● ఆకాశంలో సగం ● అన్ని రంగాల్లో ఆమెదేపైచేయి ● రాణిస్తున్న స్త్రీమూర్తులు ● నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం



అజేయం.. అమేయం ఆమె.. అకుంఠిత దీక్ష, పోరాటపటిమ ఆమె సొంతం.. ఓర్పు, నేర్పు వంటి పదాలు ఆమెను చూసే పుట్టాయేమో.. భగభగమండే బడబాగ్నిని సైతం చిరునవ్వుతో చల్లార్చగల నేర్పరి.. గుండెలను పిండేసే బాధనైనా సంకల్పబలంతో దిగమింగగల ఓర్పరి.. అనితరసాధ్యమైన లక్ష్యాలనూ అవలీలగా ఛేదించగల ధీశాలి. ఆమె సహచర్యం దివ్యౌషధం.. ఆమె మార్గదర్శకం అనన్య సామాన్యం.. ఒక్క మాటలో చెప్పాలంటే అవనితలాన అద్భుతం ఆమె. అందుకే ఆమె ఆదిశక్తి అయింది. అన్ని రంగాల్లో రాణిస్తూ నేడు ప్రపంచాన్ని శాసించే స్థాయికి ఎదిగింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఈ రోజు. ఈ సందర్భంగా గుంటూరు జిల్లాలో వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళామూర్తుల విజయగాథలతోపాటు అంతరంగాన్ని ఆవిష్కరించే యత్నమిదీ.. – సాక్షి, నెట్‌వర్క్

అకుంఠిత 'దీక్ష'తో ఐపీఎస్‌గా



నగరంపాలెం: అకుంఠిత **దీక్షతో** ఐపీఎస్‌గా ఎంపికై యువ**తకు** స్ఫూర్తిగా నిలిచారు ఆ**మె**. ఆమె పేరు దీక్ష. సొంతూ**రు** ఢిల్లీ. హైదరాబాద్‌లో సివి**ల్స్** శిక్షణ తీసుకున్నారు. దేశ**వ్యా**ప్తంగా 208వ ర్యాంక్ **సాధిం**చారు. ప్రస్తుతం ట్రైనీ ఐ**పీఎస్ అధికా**రిణిగా గుంటూరులో పనిచేస్తున్నారు. దీక్ష తల్లిదండ్రులు అసోసియేట్ ప్రొఫెసర్లు. ఆమెకు ఇద్దరు సోదరులున్నారు. భర్త ముఖేష్ ఆదాయపుపన్ను శాఖ అధికారి. దీక్ష 2016లో యూపీఎస్‌సీ రాసి ఇండియన్ ఇన్ఫర్‌మేషన్ సర్వీస్ అధికారిణిగా ఎంపికై ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంఓ)లో విధులు నిర్వర్తించారు. మళ్లీ పోటీ పరీక్షలు రాశారు. 2018లో డీఎస్పీ ర్యాంకు ఆఫీసర్‌గా ఎంపికై ఢిల్లీలో పనిచేశారు. ఐపీఎస్ లక్ష్యంగా ప్రయత్నించారు. 2021లో 208వ ర్యాంక్ సాధించి ఐపీఎస్‌కు ఎంపికయ్యారు.

ఐపీఎస్ కోసం నాలుగేళ్లు కష్టపడ్డా

ఐపీఎస్ సాధించాలనే లక్ష్యంతో నాలుగేళ్లు కష్టపడ్డా. నా లక్ష్యాన్ని చేరుకున్నా. సమాజంలో మహిళలు ముందుండాలి. పట్టుదలతో యత్నిస్తే ఏదైనా సాధించొచ్చు. సమర్థవంతంగా పనిచేసి మంచి అధికారిగా గుర్తింపు తెచ్చుకుంటా. - దీక్ష, ట్రైనీ ఐపీఎస్

స్కేటింగ్ జెస్సీ

మంగళగిరికి చెందిన జెస్సీరాజ్ స్కేటింగ్‌లో అంతర్జాతీయ ఖ్యాతి సాధించారు. ఆమె 13 ఏళ్ళ వయస్సులోనే దేశంలోనే నంబవర్ వన్ స్కేటర్‌గా గుర్తింపు తెచ్చుకున్నారు. జెస్సీని రోలర్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రపంచ స్థాయి పోటీలకు పంపింది. జెస్సీ 31.98 పాయింట్లు సాధించి ప్రపంచ స్థాయిలో ప్రథమ స్థానంలో రాణించి బంగారు పతకాన్ని దక్కించుకున్నారు. ప్రస్తుతం విజయవాడలోని ఎన్ఎస్ఎం స్కూలులో తొమ్మిదో తరగతి చదువుతున్న జెస్సీ 2021 నుంచి స్కేటింగ్‌లో శిక్షణ తీసుకుంటున్నారు. ఇప్పటివరకు ఆమె జాతీయ పోటీలలో ఒక గోల్డ్, ఒక సిల్వర్, మూడు బ్రాంజ్ మెడల్స్ సాధించారు. రాష్ట్ర పోటీలలో రెండు గోల్డ్, నాలుగు సిల్వర్, రెండు బ్రాంజ్, జిల్లా స్థాయి పోటీలలో నాలుగు గోల్డ్, ఎనిమిది సిల్వర్ మెడల్స్ సాధించారు. అథ్లెటిక్స్, నృత్యం, పెయింటింగ్‌లోనూ జెస్సీ రాణిస్తుండడం విశేషం.



రాష్ట్రపతి ద్రౌపదిముర్ము నుంచి అవార్డు అందుకుంటున్న జెస్సీరాజ్ (ఫైల్)

వైద్యదేవత అనూష

మంగళగిరి: వైకల్యాన్ని అధిగమించి మెడికల్ ఆఫీసర్‌గా రాణిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు ఇందిరానగర్ ఆరోగ్యం కేంద్రం అధికారిణి అనూష. ఆమె సొంతూరు గుంటూరు. ఏలూరు ఆశ్రంలో మెడికల్ సైన్సెస్ చదివారు. బ్రెస్ట్ క్యాన్సర్‌పై జరిపిన పరిశోధనల్లో 2,790 మందితో పోటీపడి జీనియస్ వరల్డ్ రికార్డు సాధించారు. 2022లో ప్రభుత్వ మెడికల్ ఆఫీసర్‌గా ఉద్యోగం సాధించారు. 2024లో బెస్ట్ మెడికల్ ఆఫీసర్‌గా కలెక్టర్ నుంచి అవార్డు అందుకున్నారు. రోగులకు మంచి వైద్య సేవలు అందిస్తున్నారు. ఆమె సేవల వల్ల పీహెచ్‌సీకి దేశంలోనే తొలి ఎన్క్వాస్ సర్టిఫికెట్, క్వాలిటీ ఎస్యూరెన్స్ అవార్డు లభించాయి.



రోగిని పరీక్షిస్తున్న డాక్టర్ అనూష

క్రీడా 'చంద్రిక'

చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయినా కుమిలిపోలేదు ఆమె. తాతమ్మ దగ్గర ఉంటూనే పవర్ లిఫ్టింగ్‌లో శిక్షణ తీసుకుని సత్తా చాటుతున్నారు. ఆదర్శంగా నిలుస్తున్నారు. మంగళగిరికి చెందిన ఆమె పేరు బొల్లినేని చంద్రిక. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో బంగారు, రజిత, కాంస్య పతకాలను ఆమె సాధించారు. కామన్వెల్త్‌లో నాలుగు బంగారు పతకాలు, ఏషియన్ చాంపియన్ షిప్‌లో మూడు బ్రాంజ్ మెడల్స్, ఏషియన్ పసిఫిక్‌లో నాలుగు గోల్డ్ మెడల్స్, సుబ్రత ఇంటర్నేషనల్ ఛాంపియన్ షిప్‌లో నాలుగు గోల్డ్ మెడల్స్, స్ట్రాంగెస్ట్ విమెన్ ఇన్ సౌత్ ఇండియా సీనియర్ కేటగిరిలో పతకం సాధించారు. ఫెడరేషన్ పవర్‌లిఫ్టింగ్ గేమ్స్ స్టేట్ చాంపియన్‌గా 15 ఏళ్లుగా నిలుస్తున్నారు.

అంతర్జాతీయ పవర్ లిఫ్టర్ చంద్రిక



జీవితం 'అమృత'మయం



అమృతరాణి, ఎంవీఐ

తెనాలి: కష్టాల గరళాన్ని దిగమింగి జీవితాన్ని అమృతమయం చేసుకున్నారామె.. తెనాలిలో అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఏఎంవీఐ)గా సమర్థంగా బాధ్యతలు నిర్వర్తిస్తూ ఈనాటి యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ఆమెపేరు గోలి అమృతరాణి. గ్రూప్-1 సాధించి ఈ మధ్యనే తొలి పోస్టింగ్ తెనాలిలో పొందారు. ఆమె సొంతూరు ఫిరంగిపురం. ఆమె ఎంవీఐ స్థాయికి ఎదిగిన తీరు ఆమె మాటల్లోనే..

అమ్మమ్మ ప్రోత్సాహంతో..

మా అమ్మ సింగిల్ పేరెంట్. చిన్నతనంలో ఎన్నో అవరోధాలు ఎదురయ్యాయి. విశ్రాంత ప్రభుత్వ ఉపాధ్యాయిని అయిన మా అమ్మమ్మ ప్రోత్సాహం కొండంత బలాన్ని ఇచ్చింది. ఫిరంగిపురం సెయింట్ ఆన్స్ ఎయిడెడ్ బాలికోన్నత పాఠశాలలో చదివా. పదో తరగతిలో 537 మార్కులు సాధించా. నూజివీడులోని ట్రిపుల్ ఐటీలో ఉచిత సీటు లభించింది. మెకానికల్ ఇంజినీరింగ్ చేశాను. 2015**లో** ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్‌గా బయటకొచ్చా. **కొం**తకాలం ప్రైవేటు **కాలే**జీలో జూనియర్ **అధ్యాప**కురాలిగా పనిచేశా**. సివిల్ ఇం**జినీరు సత్యనారాయణతో 2016లో ఏడడుగులు వేశా. అయినా ఉన్నతోద్యోగం సాధించాలనే నా లక్ష్యాన్ని వదలలేదు. భర్త ప్రోద్బలంతో సివిల్స్, గ్రూప్స్ రాశా. తొలిసారి నిరాశే మిగిలింది. 2023లో ఏపీపీఎస్సీకి ఎంపికయ్యా. 2024లో ఎంవీఐ ఉద్యోగం వచ్చింది. శిక్షణ తర్వాత తొలి పోస్టింగ్ తెనాలి వచ్చింది. ప్రస్తుతం మాకో బాబు ఉన్నాడు. ఎంవీఐగా పనిచేస్తున్నా. మరింత ఉన్నత స్థానం చేరుకోవడానికి గ్రూప్-1, సివిల్స్‌కు ప్రిపేరవుతున్నా.

విద్యతోనే ముందుకు..



గృహిణిగా ఇద్దరు పిల్లలకు తల్లిగా కుటుంబ బాధ్యతలు నిర్వర్తిస్తూ విద్యాశాఖలోకి ప్రవేశించాను. విశాఖపట్నం, యలమంచిలి ఉప విద్యాశాఖాధికారిగా బాధ్యతలు నిర్వర్తించా. 2017లో డీఈఓగా ఉద్యోగోన్నతి పొందా. ఇప్పటి వరకు నాలుగు జిల్లాల్లో విద్యాశాఖాధికారిగా సమర్థంగా పనిచేశా. బాలికా విద్యను ప్రోత్సహిస్తే సమాజం అభివృద్ధి సాధిస్తుంది. ఆడపిల్లలను గ్రాడ్యుయేషన్ వరకు చదివించడం తల్లిదండ్రులు ఓ బాధ్యతగా గుర్తించాలి.

- సీవీ రేణుక, జిల్లా విద్యాశాఖాధికారి

పోలీసుశాఖలో అరుణోదయం



తండ్రి ప్రభుత్వ పాఠశాల ఉద్యోగి. తన కుమార్తెలను కూడా ప్రభుత్వ ఉద్యోగులుగా చూడాలను కున్నాడు. తండ్రి కోరికను తీర్చేందుకు బీటెక్ చదివిన అరుణ దృష్టి ప్రభుత్వ ఉద్యోగ వేటలో పడింది. తొలుత కానిస్టేబుల్‌గా ఎంపికైనప్పటికీ చేరలేదు. తర్వాత వీఆర్‌ఓగా రెండున్నరేళ్ల పనిచేశారు. అంతటితో ఆగకుండా పోటీ పరీక్షలకు హాజరై ఎస్ఐగా ఉద్యోగం సాధించారు.

చిన్నచూపు చూడొద్దు

మహిళలను చిన్నచూపు చూడకూడదు. ఏదైనా సాధించగలం. విశ్రాంతి కోరుకోకుండా దేనినైనా సాధించే తత్వం ఆడవారికే ఉంటుంది. ప్రతి ఆడపిల్ల పోటీతత్వంతో ఉన్నతంగా ఎదగాలి. పోలీస్‌శాఖకు మహిళలు ప్రాధాన్యత ఇవ్వాలి. మహిళల భద్రతకు మహిళలే రక్షణగా ఉండవచ్చు.

-కె.అరుణ, ఎస్ఐ వన్‌టౌన్, నరసరావుపేట

రెండిళ్లలో భారీగా బంగారం చోరీ



సాయి నివాస్ అపార్ట్‌మెంట్‌లో ఇంటి యజమాని చంద్రమోహన్ నుంచి వివరాలు అడిగి తెలుసుకుంటున్న వెస్ట్ డీఎస్పీ కె.అరవింద్



అక్షయ లీలా హోమ్స్ అపార్ట్‌మెంట్‌లో బంగారం అపహరించి ఖాళీగా వదిలేసిన బ్యాగులు, బాక్సులు

గుంటూరు విద్యానగర్‌లోని రెండిళ్లలో గురువారం భారీ చోరీలు జరిగాయి. ఈ ఘటనలు నగరంలో కలకలం రేపాయి. గుంటూరు విద్యానగర్‌లోని సాయినివాస్ అపార్ట్‌మెంట్‌లోని ఓ ఫ్లాట్‌లో సాయంత్రం.. అదే వీధిలోని అక్షయ లీలా హోమ్స్‌లోని మరో ఫ్లాట్‌లో అర్ధరాత్రి చోరీలు జరిగాయి. సుమారు రూ.2.50 కోట్ల విలువైన 2.5 కిలోల బంగారు ఆభరణాలు, రూ.2.50 లక్షలు చోరీకి గురయ్యాయి. ఘటనాస్థలాలను డీఎస్పీ అరవింద్, ఎస్ఐ నరహరి పరిశీలించారు.

–లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్)

ఏఎన్‌యూ బీఈడీ ప్రశ్నపత్రం లీక్

- పరీక్షకు అరగంట ముందే లీకైన మొదటి సెమిస్టర్ ప్రశ్నపత్రం
- పరీక్షల నిర్వహణలో ఏఎన్‌యూ అధికారులు నిర్లక్ష్యం

పెదకాకాని : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పరిధిలో శుక్రవారం నిర్వహించిన బీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్ష పత్రం లీకైన ఘటన కలకలం రేపింది. మధ్యాహ్నం రెండు గంటలకు ప్రాస్పెక్టివ్స్ ఇన్ చైల్డ్ డెవలప్మెంట్ పరీక్ష ప్రారంభం కావాల్సి ఉండగా పరీక్ష ప్రారంభానికి అరగంట ముందే ప్రశ్నపత్రం లీక్ అయినట్లు తెలుస్తోంది. సీడీ ద్వారా ఆన్‌లైన్‌లో అరగంట ముందుగా ప్రశ్నపత్రాన్ని రిలీజ్ చేశామని సంబంధిత అధికారులు చెబుతున్నారు. కానీ మొబైల్ ద్వారా అరగంట ముందే లీకై బయటకు వచ్చినట్లు తెలుస్తోంది. పరీక్షల నిర్వహణకు సబంధించిన కొందరు అధికారులు పరీక్ష కేంద్రాల నిర్వాహకుల వ్యవహార శైలిపై ఉదాసీనంగా ఉండడమే లీకేజీకి కారణంగా తెలుస్తోంది. దీంతోపాటు కొత్తగా పరీక్షకు అరగంట ముందుగా సీడీ ద్వారా విడుదల చేసే విధానం కూడా ప్రశ్నపత్రం సులభంగా లీక్ కావడానికి కారణమని పలువురు పేర్కొంటున్నారు. శుక్రవారం పరీక్ష పేపర్ లీక్ అయిందని ఘటన వెలుగులోకి వచ్చినప్పటికీ గురువారం కూడా ప్రశ్నపత్రం అరగంట ముందుగానే లీక్ అయిందన్న విమర్శలు ఉన్నాయి. సంబంధిత అధికారులకు తెలిసినా బయటకు రానియకుండా చూడటం వల్లే పరిస్థితులు శ్రుతి మించుతున్నాయనే ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. బీఈడీ పరీక్షలకు సబంధించిన పరీక్ష కేంద్రాల ఖరారు, పరీక్షలను పర్యవేక్షించే అధికారుల నియామకం వంటి కీలక అంశాలు కొన్ని పరీక్షా కేంద్రాల నిర్వాహకుల కనుసన్నల్లో జరుగుతుండటం ఇలాంటి ఘటనలకు కారణమవుతోందనే విమర్శలూ వస్తున్నాయి. ప్రశ్నపత్రం లీకేజీపై ఉన్నత విద్యాశాఖా మంత్రి లోకేష్ విచారణకు ఆదేశించారు.

నేటి నుంచి మూడు వంతెనల మీదుగా రాకపోకలు

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): రైల్వే ట్రాక్ ఎక్స్‌టెన్షన్ పనుల నిమిత్తం గుంటూరు మూడు వంతెనల మీదుగా నవంబర్ 25 నుంచి రాకపోకలు నిలిపివేసిన విషయం తెలిసిందే. 60 రోజుల్లో పనులు పూర్తి చేసి రాకపోకలు పునరుద్ధరిస్తామని అధికారులు ప్రకటించారు. అయితే వంద రోజులు పూర్తయినా ఇప్పటికీ పనులు పూర్తిచేయలేదు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజల అవస్థలను గుర్తించిన సాక్షి దినపత్రిక పలుమార్లు కథనాలు ప్రచురించింది. శుక్రవారం కూడా 'రైల్వే ట్రాక్ విస్తరణతో నరకయాతన' శీర్షికన కథనం ప్రచురించింది. దీంతో స్పందించిన అధికారులు హడావుడిగా పెండింగ్ పనులు పూర్తిచేయకుండానే వంతెనలపై నుంచి రాకపోకల పునరుద్ధరణకు సిద్ధం చేశారు. శనివారం సాయంత్రం 4 గంటలకు కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, కలెక్టర్ నాగలక్ష్మి, కమిషనర్ పులి శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు మూడు వంతెనలను ప్రారంభిస్తారని అధికారులు చెబుతున్నారు.


రైల్వే ట్రాక్ విస్తరణతో నరకయాతన

శుక్రవారం సాక్షిలో ప్రచురితమైన కథనం

డీఎస్సీకి ఉచిత ఆన్‌లైన్ శిక్షణ

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): మెగా డీఎస్సీకి ఉచిత ఆన్‌లైన్ శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్టు బీసీ సంక్షేమ శాఖ అధికారి కె.మయూరి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. గుంటూరు జిల్లాకు చెందిన బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థుల నుంచి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు తమ బయోడేటాతోపాటు 10వ తరగతి, టీటీసీ/బీఎడ్ మార్కుల లిస్ట్, టెట్ మార్కుల లిస్ట్, కుల ధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం, ఆధార్, 2 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు జతపరిచి రాజాగారితోటలోని బీసీ స్టడీ సర్కిల్, గుంటూరు కార్యాలయంలో ఈనెల 10వ తేదీ నుంచి అందించాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 0863-2358071 నంబర్‌ను సంప్రదించాలని వివరించారు.

15న వెంకటపాలెం టీటీడీలో శ్రీనివాస కల్యాణోత్సవం

వివరాలు వెల్లడించిన టీటీడీ ఈవో శ్యామలరావు

వెంకటపాలెం(తాడికొండ): లోక కల్యాణార్థం శ్రీనివాస కల్యాణోత్సవం ఈ నెల 15న గుంటూరు జిల్లా వెంకటపాలెంలోని టీటీడీ ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు టీటీడీ ఈవో జె. శ్యామలరావు తెలిపారు. శుక్రవారం వెంకటపాలెంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఆర్డీయే కమిషనర్ కన్నబాబు, కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనర్ వినయ్ చంద్, ఎస్పీ సతీష్ కుమార్, సంయుక్త కలెక్టర్ ఎ.భార్గవ తేజతో కలిసి శ్యామలరావు ఏర్పాట్లు పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. శ్రీవారి వైభవాన్ని దేశం నలుమూలల అంతర్జాతీయ స్థాయిలో వ్యాప్తి చేసేలా లోక కల్యాణార్థం స్వామివారి కల్యాణోత్సవాలను అనేక ప్రాంతాల్లో టీటీడీ నిర్వహిస్తోందన్నారు. ఇక్కడ శ్రీవారి కల్యాణోత్సవం నిర్వహించాలని విజ్ఞప్తులు రావటంతో ఈనెల 15న జరిపేందుకు ముహూర్తం నిర్ణయించామన్నారు. కల్యాణోత్సవంలో సీఎం నారా చంద్రబాబు నాయుడు పాల్గొననున్నారని, కల్యాణాన్ని తిలకించేందుకు 20 వేల మంది భక్తులు హాజరయ్యే అవకాశం ఉందని వివరించారు. 15న సాయంత్రం కల్యాణం జరుగుతందని వివరించారు. అనంతరం పోస్టర్ విడుదల చేశారు.



పోస్టరు విడుదల చేస్తున్న టీటీడీ ఈవో శ్యామలరావు సీఆర్డీఏ కమిషనర్ తదితరులు

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో శుక్రవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్టం : రూ. **5,400** గరిష్టం : రూ. **7,100**

మోడల్ ధర రూ. **6,400**

క్లుప్తంగా

1,22,426 బస్తాలు మిర్చి విక్రయం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 1,11,958 బస్తాల మిర్చి రాగా గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,22,426 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల సగటు ధర రూ.10,000 నుంచి రూ.14,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.10,000 నుంచి రూ.14,000 వరకు ధర లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.7,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 44,470 బస్తాలు నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఎ.చంద్రిక తెలిపారు.

పసుపు ధరలు

దుగ్గిరాల: దుగ్గిరాల పసుపు యార్డులో శుక్రవారం 229 బస్తాలు వచ్చాయి. పసుపు మొత్తం అమ్మకం చేసినట్లు వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యదర్శి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. కొమ్ములు 140 బస్తాలు వచ్చాయి. వాటి కనిష్ట ధర రూ.8,000 గరిష్ట ధర రూ.9,800 మోడల్ ధర రూ.9,400, కాయలు 89 బస్తాలు వచ్చాయి. వాటి కనిష్ఠ ధర రూ.8,000, గరిష్ఠ ధర రూ.9,800, మోడల్ ధర రూ.9,400, మొత్తం 171.750 క్వింటాళ్ల అమ్మకాలు జరిగినట్లు ఆయన వివరించారు.

బ్యాంక్ ఉద్యోగుల నిరసన



కొరిటెపాడు(గుంటూరు): బ్యాంకు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 24, 25 తేదీల్లో నిర్వహించ తలపెట్టిన దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని బ్యాంకు ఉద్యోగ సంఘాల ఐక్య వేదిక పిలుపునిచ్చింది. ఈమేరకు ఉద్యోగులు, అధికారులు శుక్రవారం చంద్రమౌళి నగర్‌లోని కెనరా బ్యాంక్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. బ్యాంక్ ఉద్యోగ సంఘాల ఐక్య వేదిక(యుఎఫ్‌బీయూ) జిల్లా కన్వీనర్ బాషా మాట్లాడుతూ బ్యాంక్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎస్‌బీఐ ఉద్యోగ సంఘ నేత పరేంద్ర మాట్లాడుతూ ఐడీబీఐ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తున్నట్టు పేర్కొన్నారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. యూబీఐ ఉద్యోగ నేత రాంబాబు, యూఎఫ్‌బీయూ సలహాదారుడు పి.కిషోర్ కుమార్ పాల్గొన్నారు.

ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి



క్రైం బ్రాంచ్ ఏఎస్పీ సుప్రజను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ అనితాదేవి, రత్నప్రియ, తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: జీవితంలో ఎటువంటి విపత్కరస్థితి ఎదురైనామహిళలు ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలని గుంటూరు జిల్లా క్రైమ్ బ్రాంచ్ ఏఎస్పీ కె.సుప్రజ పేర్కొన్నారు. పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాలలో మహిళా విభాగ, రోటరీ క్లబ్ గుంటూరు ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏస్పీ సుప్రజను సత్కరించారు. కార్యక్రమంలో గుంటూరు రోటరీ క్లబ్ అధ్యక్షురాలు పి.రత్నప్రియ, విశ్రాంత తెలుగు అధ్యాపకురాలు డాక్టర్ ఎం.స్వర్ణలతాదేవి, డాక్టర్ ఆర్.సిందూజ, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.అనితాదేవి, మహిళా విభాగ కన్వీనర్ కవిత, సభ్యులు ఆర్.జయ శైలజ, డాక్టర్ నాగ నిర్మలా రాణి, డాక్టర్ ఆర్.శిరీష, కె.సునీత, బి.జ్యోతి, జమృద్ బేగం, విద్యార్థినులు పాల్గొన్నారు.

మహిళల పాత్ర కీలకం

సమాజంలో మహిళల పాత్ర ఎంతో కీలకమని, అన్ని రంగాల్లో మహిళలు ముందంజలో ఉండటం గర్వకారణమని ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జెడ్పీ కార్యాలయ ఆవరణలో శుక్రవారం మహిళా ఉద్యోగినుల ఆటల పోటీలను ఆమె ప్రారంభించారు. హెనీ క్రిస్టినా మాట్లాడుతూ మహిళల ప్రాధాన్యాన్ని వివరించారు. మహిళా ఉద్యోగులకు టగ్ ఆఫ్ వార్, మ్యూజికల్ చైర్స్ పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో వి.జ్యోతి బసు, అకౌంట్స్ అధికారి శామ్యూల్ పాల్ పాల్గొన్నారు.

డీఆర్‌ఎం కార్యాలయంలో..

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): మహిళలు అన్ని రంగాల్లో సాధికారత సాధించాలని గుంటూరు రైల్వే డీఆర్‌ఎం ఎం.రామకృష్ణ ఆకాంక్షించారు. స్థానిక పట్టాభిపురంలోని గుంటూరు రైల్వే డివిజన్ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. డీఆర్‌ఎం మాట్లాడుతూ మహిళల ప్రాధాన్యాన్ని వివరించారు. అనంతరం డివిజన్ కార్యాలయంలోని మహిళా ఉద్యోగులకు పలు క్రీడా, సాంస్కృతిక పోటీలను నిర్వహించారు. విశేష కృషి చేసిన ఉద్యోగులను సత్కరించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారికి పతకాలను, సౌత్ సెంట్రల్ రైల్వే ఉమెన్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఏడీఆర్‌ఎం కె.సైమన్, సౌత్ సెంట్రల్ రైల్వే ఉమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు ఎం.ఆశాలత, సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్ షేక్.షాహబాజ్ హనూర్, సీనియర్ డివిజనల్ ఇంజనీర్ కో ఆర్డినేషన్ జె.అనూష, సీనియర్ డివిజనల్ ఫైనాన్స్ మేనేజర్ అమూల్యారాజ్, డివిజనల్ కమర్షియల్ మేనేజర్ , కో ఆర్డినేషన్ ప్రదీప్, ఆయా విభాగాధిపతులు తదితరులు పాల్గొన్నారు.



టగ్ ఆఫ్ వార్ పోటీలను ప్రారంభిస్తున్న హెనీ క్రిస్టినా, జ్యోతిబసు



రైల్వే డివిజన్ మహిళా ఉద్యోగులను అభినందిస్తున్న డిఆర్‌ఎం, రామకృష్ణ

హనుమంత వాహనంపై నృసింహుడు



మంగళగిరి/మంగళగిరి టౌన్: మంగళగిరిలోని శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మూడవ రోజు శుక్రవారం రాత్రి స్వామిని హనుమంత వాహనంపై ఊరేగించారు. అభయ ప్రదాత అయిన హనుమంతుని భుజ స్కందాలపై లక్ష్మీ నరసింహస్వామి శ్రీదేవి భూదేవి సమేతంగా అధిరోహించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఆలయ ఈవో రామ కోటి రెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. దుగ్గిరాల మండలం పెదపాలెం గ్రామానికి చెందిన వాసిరెడ్డి మల్లేశ్వరరావు (రాజేష్) కైంకర్యపరులుగా వ్యవహరించారు. శనివారం రాత్రి రాజాధిరాజ వాహనంపై స్వామి గ్రామోత్సవం జరగనుంది.

హనుమంత వాహనంపై శ్రీదేవి భూదేవి సమేత నృసింహుడు



ఉత్సవానికి హాజరైన భక్తులు

ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించిన విదేశీ బృందం

బెల్లంకొండ: ప్రకతి వ్యవసాయ విధానంలో మండలంలో సాగు చేస్తున్న వరి, కంది క్షేత్రాలను ఫ్రాన్స్ దేశానికి చెందిన విదేశీ బృందం సభ్యులు శుక్రవారం పరిశీలించారు. మండలంలోని నాగిరెడ్డి పాలెంలో ఏర్పాటు చేసిన ప్రకతి వ్యవసాయ క్షేత్రాలకు విదేశీ బందాన్ని తీసుకెళ్లి జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ కె.అమలుకుమారి అవగాహన కల్పించారు. బీజామృతం, విత్తన గుళికలు, ద్రవ జీవామతం, ఘనజీవామతం తయారీ విధానాలను రైతులు వివరించారు.

మహిళా ఫిర్యాదుల విండోకు విశేష స్పందన

57 ఫిర్యాదులకు తక్షణ పరిష్కారం



మహిళా పోలీస్‌స్టేషన్‌లో మహిళల నుంచి ఫిర్యాదుల స్వీకరణ

నగరంపాలెం: మహిళా దినోత్సవం సందర్భంగా చేపట్టిన మహిళా ఫిర్యాదుల విండోకు విశేష స్పందన లభించిందని ట్రైనీ ఐపీఎస్ అధికారిణి దీక్ష చెప్పారు.ఎస్పీ సతీష్‌కుమార్ నేతృత్వంలో గురువారం జిల్లా వ్యాప్తంగా ఉన్న పోలీస్‌స్టేషన్లలో మహిళా ఫిర్యాదుల విండో కార్యక్రమాన్ని నిర్వహించారు. చిమహిళా పోలీస్ అధికారులు, సిబ్బంది ఫిర్యాదులు స్వీకరించారు. కొన్ని ఫిర్యాదులను కౌన్సెలింగ్ ద్వారా పరిష్కరించారు. జిల్లా వ్యాప్తంగా 64 మంది మహిళలు ఫిర్యాదులివ్వగా, అందులో 57 సమస్యలను తక్షణం పరిష్కరించినట్టు అధికారులు చెప్పారు. ఈ సదర్భంగా ట్రైనీ ఐపీఎస్ అధికారిణి దీక్ష మాట్లాడుతూ ప్రత్యేక ఫిర్యాదుల విండో మంచి కార్యక్రమమని పేర్కొన్నారు.

దివ్యాంగుల బదిలీల్లో వెసులుబాటు కల్పించండి

గుంటూరు వెస్ట్: ప్రభుత్వం చేపట్టిన బదిలీల్లో దివ్యాంగ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని దివ్యాంగ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎల్లయ్య కోరారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఈ మేరకు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎల్లయ్య మాట్లాడుతూ 40 శాతం వైకల్యం ఉన్న దివ్యాంగులను ప్రాధాన్య క్రమంలో చేర్చి బదిలీలు నిర్వహించాలన్నారు. 70 శాతం పైబడి ఉన్న వారికి బదిలీల నుంచి మినహాయింపునివ్వాలని ఒకవేళ వారు కోరుకుంటే మొదటి ప్రాధాన్యత వారికే ఇవ్వాలని కోరారు. 2025లో రూపొందించిన ఉపాధ్యాయ బదిలీ చట్టంలోని దివ్యాంగులకు ఇబ్బందికరంగా ఉన్న అంశాలను తొలగించాలన్నారు.

మనస్తాపంతో డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్య

పెదకూరపాడు: చదువుకోవటం నాకు ఇష్టం లేదు... నన్ను బలవంతం పెట్టకండి.. నేను హాస్టల్‌కి వెళ్లను. ఇంటివద్ద ఉంటాను... అంటూ విద్యార్థి చెప్పడంతో తల్లి మందలించింది. దీంతో మనస్తాపం చెందిన విద్యార్థిని పంట పొలంలోని పురుగులు మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన పల్నాడు జిల్లా పెదకూరపాడు మండలంలోని జలాలపురంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. జలాలపురం గ్రామానికి చెందిన మన్నవ శరీలు, చిట్టెమ్మల కుమార్తె మన్నవ జోష్ రాణి (17) నరసరావుపేటలోని ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని సెలవులకు స్వగ్రామం జలాలపురం వచ్చింది. సెలవులు అనంతరం కళాశాలకు వెళ్లకపోవటంతో తల్లి మందలించింది. చదువు ఇష్టం లేదని జోష్ రాణి చెప్పటంతో కళాశాలకు వెళ్లక పోతే నాతో పాటు వ్యవసాయ పనులకు రావాలని ఒత్తిడి చేయటంతో రెండు రోజులపాటు తల్లితో కలిసి మిరప కోత పనులకు వెళ్లింది. ఈ క్రమంలో బుధవారం మిర్చి కోతలు కోస్తున్న పంట పొలంలో రైతు దాచుకున్న పురుగులు మందును తాగింది. వాంతులు రావడంతో గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను సత్తెనపల్లి ప్రైవేటు వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మృతి చెందింది. ఆమె మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు.

జనరిక్ ఔషధాల వినియోగంపై అవగాహన కల్పించాలి

నరసరావుపేట: జనరిక్ మందుల ఔషధాల వినియోగం పెరిగేలా డాక్టర్లు శ్రద్ధ చూపాలని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు పేర్కొన్నారు. శుక్రవారం జన ఔషధి దివస్‌ను పురస్కరించుకొని పల్నాడురోడ్డులోని పాత ప్రభుత్వ హాస్పిటల్ ఎదురుగా ఉన్న ప్రధానమంత్రి జనరిక్ షాపు వద్ద డీఎంహెచ్‌ఓ, డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ విభాగాలు సంయుక్తంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎంపీ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఏర్పాటు చేసిన జనరిక్ షాపుల ద్వారా చాలా తక్కువ ధరకే నాణ్యమైన మందులు అందించటం జరుగుతుందని చెప్పారు.

పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలి

కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు వెస్ట్: పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో నిర్వహించిన ఇండస్ట్రియల్ అండ్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ప్రతి నియోజకవర్గంలోనూ ఎంఎస్ఎంఈ క్లస్టర్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. పరిశ్రమల స్థాపనకు అనుకూలమైన భూములను గుర్తించాలన్నారు. మంగళగిరి మండలంలో గోల్డ్ స్మిత్, హ్యాండ్‌లూమ్ క్లస్టర్ల ఏర్పాటును వేగవంతం చేయాలని సూచించారు. పీఎం విశ్వకర్మ యోజన దరఖాస్తులు పెండింగ్ లేకుండా పరిష్కరించాలన్నారు. ప్రభుత్వ సబ్సిడీ కోసం నిర్ణీత సమయంలో ధ్రువపత్రాలు అందజేయని ఎంఎస్‌ఎంఈ దరఖాస్తుదారులకు మరోసారి గుర్తు చేయాలన్నారు. జిల్లాలోని 49 ఎంఎస్‌ఎంఈ పరిశ్రమలకు ఇన్వెస్ట్‌మెంట్ సబ్సిడీ, రీఎంబర్స్‌మెంట్ ఆఫ్ ఇంట్రస్ట్ సబ్సిడీ, కాస్ట్ సబ్సిడీకి సంబంధించి రూ.2,12,79,045 మంజూరు చేస్తూ కమిటీ ఆమోదించిందని కలెక్టర్ వివరించారు. సమావేశంలో పరిశ్రమల శాఖ జీఎం జయలక్ష్మి, జిల్లా ఉప రవాణా కమిషనర్ సీతారామిరెడ్డి, లీడ్ బ్యాంక్ మేనేజర్ మహిపాల్ రెడ్డి, కమర్షియల్ టాక్స్ డీసీబీహెచ్ మనోరమ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సాంకేతికతతో కొత్త అవకాశాలు

ల్లాయిడ్ హెల్త్ కేర్ సేల్స్ అండ్ మార్కెటింగ్ ప్రెసిడెంట్ మహేష్ కవథేకర్



ల్లాయిడ్ హెల్త్ కేర్ సేల్స్ అండ్ మార్కెటింగ్ ప్రెసిడెంట్ మహేష్ కవథేకర్

చేబ్రోలు: సాంకేతికతతో కొత్త అవకాశాలు పుట్టుకొస్తాయని ల్లాయిడ్ హెల్త్ కేర్ సేల్స్ అండ్ మార్కెటింగ్ ప్రెసిడెంట్ మహేష్ కవథేకర్ అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో ''ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ నావిగేటింగ్ ద ఫ్యూచర్ ఆఫ్ మేనేజ్‌మెంట్ విత్ టెక్నాలజీ అండ్ సస్టైనబిలిటీ '' అనే అంశంపై రెండు రోజుల పాటు బ్లెండెడ్ మోడ్‌లో నిర్వహించే అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మహేష్ కవథేకర్ మాట్లాడుతూ ఆటోమేషన్, ఏఐ, డేటా ఎనలిటిక్స్ తదితర అంశాల గురించి వివరించారు.

కిమ్స్ శిఖర హాస్పిటల్‌లో అరుదైన శస్త్ర చికిత్సలు



సమావేశంలో శస్త్రచికిత్స వివరాలు వెల్లడిస్తున్న కిమ్స్ శిఖర హాస్పటల్ వైద్య బృందం

గుంటూరు మెడికల్: రాష్ట్రంలోనే తొలిసారిగా మినిమల్లి ఇన్వేజివ్ (చిన్న గాటుతో) యూనిపోర్టల్ వాట్స్ విధానంలో గుంటూరు కిమ్స్ శిఖర హాస్పిటల్లో రెండు అరుదైన శస్త్రచికిత్సలను విజయవంతంగా నిర్వహించినట్టు డాక్టర్ ఖాజా అబ్దుల్ మొయిన్‌బేగ్ తెలిపారు. కిమ్స్ శిఖర హాస్పటల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.. బీపీ, షుగర్ ఉన్న గుంటూరుకు చెందిన 60 ఏళ్ల వ్యక్తి శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడుతూ అత్యవసర స్థితిలో మూడు రోజుల క్రితం కిమ్స్ శిఖర ఆస్పత్రిలో చేరారు. చీఫ్ కన్సల్టెంట్ థొరాసిక్, మినిమల్ యాక్సిస్ సర్జన్ డాక్టర్ ఖాజా అబ్దుల్ మొయిన్ బేగ్ నేతృత్వంలో వెంటనే రోగిని పరీక్షించగా కుడివైపు ఊపిరితిత్తిలో గాలిబుడగ ఏర్పడి అది పగిలిపోయి లంగ్ పూర్తిగా కుంచించుకుపోయినట్లు గుర్తించారు. యూని పోర్టల్ వాట్స్ విధానంలో చిన్న గాటుతో శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించారు. అలాగే విజయవాడకు చెందిన 38 ఏళ్ల గృహిణి తరచూ లంగ్ ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతూ హాస్పిటల్లో చేరారు. ఆమె లంగ్ ఎడమవైపు కింది భాగంలో నీటి గడ్డ లాంటిది ఉండడాన్ని వైద్యులు గుర్తించారు. ఈమెకు కూడా యూని పోర్టల్ వాట్స్ విధానంలో శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించారు. మూడు రోజుల్లోనే రోగులిద్దరూ డిశ్చార్జ్ అయ్యారు. ఈ సందర్భంగా కిమ్స్ శిఖర హాస్పటల్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్, చీఫ్ న్యూరో సర్జన్ డాక్టర్ చిట్టెం లక్ష్మణరావు మాట్లాడుతూ ఊపిరితిత్తుల సమస్యలకు తమ వైద్యశాలలో అత్యాధునిక సౌకర్యాలు ఉన్నాయని వివరించారు. అరుదైన శస్త్రచికిత్సలు చేసిన వైద్యులను కిమ్స్ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ అద్విక్ బొల్లినేని, కిమ్స్ శిఖర హాస్పిటల్ సీఈఓ సుధాకర్ జాదవులు అభినందించారు.

వీఐటీలో విటోపియా క్రీడా సాంస్కృతిక ఉత్సవం ప్రారంభం



ప్రదర్శనలు ఇస్తున్న విద్యార్థులు

తాడికొండ: విద్యతో పాటు క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో అవసరమని తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ అన్నారు. వీఐటీ–ఏపీ విశ్వవిద్యాలయంలో విటోపియా–2025 వార్షిక క్రీడలు, సాంస్కృతిక ఉత్సవం శుక్రవారం ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా తాడికొండ శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ క్రీడలు మానసికాభివృద్ధికి దోహదపడతాయని చెప్పారు.వీఐటీ వైస్ ప్రెసిడెంట్ శంకర్ విశ్వనాథన్, వీఐటి–ఏపి విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ డాక్టర్ కోటా రెడ్డి మాట్లాడుతూ విశ్వవిద్యాలయం ప్రగతిని వివరించారు. మూడేళ్లుగా అవుట్ లుక్ ర్యాకింగ్స్‌లో అభివృద్ధి చెందుతున్న ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు కేటగిరిలో దేశంలోనే ప్రథమస్థానంలో వీఐటీ ఉందని వెల్లడించారు. సాయంత్రం జరిగిన ప్రా–షోలో సెహరి బ్యాండ్, స్వరాగ్ బ్యాండ్, డీజే పరోమాల సంగీత విభావరి అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో విశ్వ విద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ జగదీష్ చంద్ర ముదిగంటి, డాక్టర్ కృష్ణసామి (విటోపియా కన్వీనర్), డాక్టర్ ఖాదీర్ పాషా (స్టూడెంట్ వెల్ఫేర్ డెప్యూటీ డైరెక్టర్) పాల్గొన్నారు.

మహిళలు ధైర్యంగా మెలగాలి

జిల్లా ఏఎస్పీ కె.సుప్రజ (క్రైం)

నగరంపాలెం(గంటూరు వెస్ట్): అన్ని వేళల్లో మహిళలు ధైర్యంగా ఉండాలని జిల్లా ఏఎస్పీ కె.సుప్రజ (క్రైం) అన్నారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గురువారం పోలీస్ కవాతు మైదానంలో ఓపెన్‌హౌస్ నిర్వహించారు. జిల్లా ఏఎస్పీ సుప్రజ మాట్లాడుతూ మహిళలు తమ లక్ష్యాలను చేధించాలని అన్నారు. తద్వారా నలుగురికి ఆదర్శంగా నిలవాలని చెప్పారు. స్త్రీలు లేనిదే జననం లేదని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థినీలకు ఆయుధాల పనితీరుపై మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ సుబ్బారావు, సిబ్బంది అవగాహన కల్పించారు. కొత్తపేట పీఎస్ పరిధిలోని శ్రీజలగం రామా రావు మెమోరియల్ మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో మహిళా సాధికారత ర్యాలీ, పాతగుంటూరు పీఎస్ పరిధిలోని యాదవ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా ఏఎస్పీ (ఏఆర్) హనుమంతు, ఎస్‌ఐలు రమేష్ (కొత్తపేట పీఎస్), వెంకటేశ్వర్లు (పాతగుంటూరు పీఎస్) పాల్గొన్నారు.



ఓపెన్‌హౌస్‌లో తుపాకీ పనితీరుపై అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ



విద్యార్థులతో మహిళా సాధికారత ర్యాలీ

విద్యార్థినితో అసభ్యంగా ప్రవర్తించిన ఇన్విజిలేటర్‌కు దేహశుద్ధి

- ఎంబీఏ చదువుతున్న వ్యక్తికి ఇన్విజిలేటర్ బాధ్యతలు
- సంజాయిషీ కోరిన ఆర్ఐఓ

గుంటూరు ఎడ్యుకేషన్: ఇంటర్మీడియెట్ పరీక్షలు రాస్తున్న ఓ విద్యార్థినితో అసభ్యంగా ప్రవర్తించిన ఇన్విజిలేటర్‌కు తల్లిదండ్రులు దేహశుద్ధి చేశారు. ప్రకాశం జిల్లా దర్శి మండలానికి చెందిన విద్యార్థిని గుంటూరులోని ఓ ప్రైవేటు జూనియర్ కళాశాల హాస్టల్లో ఉండి చదువుతోంది. ఈనెల 3 నుంచి పొన్నూరు రోడ్డులోని ఓ ప్రైవేటు కళాశాల పరీక్షా కేంద్రంలో సీనియర్ ఇంటర్ పరీక్షలకు హాజరవుతోంది. విద్యార్థిని పరీక్ష రాస్తున్న గది ఇన్విజిలేటర్‌గా వ్యవహరిస్తున్న యువకుడు పరీక్షలు ప్రారంభమైనప్పటి నుంచి ఆమెతో అసభ్యంగా ప్రవర్తించడం, ఫోన్ నంబర్ ఇవ్వాలంటూ అడగడం చేశాడు. దీంతో మనస్థాపం చెందిన విద్యార్థిని తాను చదువుతున్న కళాశాల యాజమాన్యం దృష్టికి విషయాన్ని తీసుకెళ్లింది. కళాశాల ప్రతినిధులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఆ యువకుడిని రెండు రోజుల క్రితం పోలీసులు తీవ్రంగా మందలించారు. అదే రోజు అతన్ని ఇన్విజిలేషన్ విధుల నుంచి అధికారులు తొలగించారు. తాజాగా శుక్రవారం మధ్యాహ్నం పరీక్ష కేంద్రం వద్దకు చేరుకున్న విద్యార్థిని తల్లిదండ్రులు చీఫ్ సూపరింటెండెంట్‌తో పాటు కళాశాల ప్రిన్సిపాల్‌తో మాట్లాడి యువకుడిని కళాశాలకు పిలిపించారు. అతడికి దేహశుద్ధి చేశారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు అందుబాటులో లేకపోవడంతో ఓ ప్రైవేటు కళాశాలలో ఎంబీఏ చదువుతున్న వ్యక్తిని అధికారులు ఇన్విజిలేటర్‌గా నియమించడం గమనార్హం. ఈ విషయం ఆర్ఐవో జీకే జుబేర్ దృష్టికి వెళ్లడంతో ఎంబీఏ విద్యార్థిని ఇన్విజిలేటర్‌గా నియమించడంపై చీఫ్ సూపరిండెంట్‌ను సంజాయిషీ కోరారు.